

● పొచ్చెర జలపాతం



● కుంటాల జలపాతం



జర.. జాగ్రత్త!!

- జిల్లాలో ప్రమాదకరంగా మారిన ప్రముఖ జలపాతాలు
- కుంటాల, పొచ్చెర వద్ద కనిపించని ఎలాంటి భద్రతా చర్యలు
- ప్రాణాలు పోతున్నా.. అధికారులకు పట్టింపు కరువాయే!!
- అభివృద్ధిపై ఉలుకుపలుకు లేని పాలకులు
- మొదలైన వర్షాకాలం సీజన్
- సుదూర ప్రాంతాల నుంచి జలపాతాలకు మొదలైన పర్యాటకుల తాకిడి
- జిల్లాలో కుంటాల, పొచ్చెరతో పాటు కనకాయి, గాయత్రి, ఖండాల జలపాతాలు

ఆదిలాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో ఎటుచూసినా జలపాతాలే కనిపిస్తాయి. ముఖ్యంగా కుంటాల, పొచ్చెర, కనకాయి, గాయత్రి, ఖండాల జలపాతాలకు పర్యటకుల తాకిడి కనిపిస్తుంది. వర్షాకాల సీజన్ ప్రారంభం కావడంతో జలపాతాల వద్ద సందడి మొదలయ్యింది. గత వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు జలపాతాలు వరదనీటితో పరవళ్లు పెడుతున్నాయి. ఎత్తైన ప్రదేశం నుంచి జాలువారే నీటి పరవళ్లను అతి దగ్గర నుంచి చూసేందుకు ఆరాట పడే క్రమంలో పర్యాటకులు ప్రమాదాల భారీన పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. యేటా పర్యాటకుల ప్రాణాలు పోతున్నా.. అధికారులకు పట్టింపు కరువవుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. గతంలో జలపాతాల వద్ద జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు జిల్లా అటవీ శాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. అయినా ఇప్పటి వరకు ఆచరణ సాధ్యం మాత్రం కావడం లేదు. అటవీ శాఖ, పర్యాటక శాఖతో పాటు పాలకుల్లోనూ ఉలుకుపలుకు కనిపించడం లేదు. గతంలోనే రాష్ట్ర అటవీ శాఖ మంత్రిగా పని చేసిన జోగు రామన్నతో పాటు రాష్ట్ర పర్యటక, అటవీ శాఖ ఉన్నతాధికారులు జలపాతాన్ని సందర్శించి రూ.10 కోట్ల నిధులతో ఆధునికీకరణ పనులను చేపట్టాలని నిర్ణయించారు. అయినా ఇప్పటి వరకు నిధులు మంజూరు కాకపోవడంతో కుంటాల జలపాతం అభివృద్ధికి ఆమడ దూరంగానే కనిపిస్తోంది. అప్పట్లో ఆధునికీకరణ పనులను చేపట్టవద్దంటూ కొందరు ఆందోళనకారులు అడ్డుకున్నారు. కుంటాల బచావో పేరిట సహజ సిద్ధమైన ప్రకృతి అందాలను కాపాడే ప్రయత్నాలు చేశారు. మళ్లీ వానాకాలం సీజన్ మొదలు కావడంతో కుంటాల జలపాతానికి పర్యాటకుల తాకిడి మొదలయ్యింది. ప్రమాదమని తెలిసినా ప్రకృతి అందాలను చూసేందుకు పర్యాటకులు తండోప తండాలుగా తరలి వస్తున్నారు. ఏదైనా జరగకూడని ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరన్న ప్రశ్నలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ప్రమాదకరంగా జారుడు బండలు

జలపాతాల వద్ద నునుపైన జారుడుబండలు ప్రమాదకరంగా మారి కనిపిస్తున్నాయి. కుంటాల జలపాతం వద్ద సహజ సిద్ధంగా ఏర్పడిన నీటి గుండాల వద్ద యేటా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. నీటి గుండాల్లో జారీ పడిన ఏ ఒక్కరూ ఇప్పటి వరకు బతికి బయట పడిన దాఖలాలు లేవు. లోతైనా నీటి గుండాల్లో పెద్దపెద్ద బొరియలు ఉండడంతో ప్రమాదవశాత్తు పడిన వారి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. రక్షించే ప్రయత్నం చేసినా.. వారి ప్రాణాలూ మిగలడం లేదు. గతంలో నీటి గుండాల చుట్టు ఇనుపరాడ్లతో కంచెను ఏర్పాటు చేసినా.. వరద నీటికి కొట్టుకుపోయి పూర్తిగా కనిపించకుండా పోయింది. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా కనిపించడం లేదు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న పర్యాటకులు నీటి గుండాలను పసిగట్టలేక ప్రమాదాల భారీన పడుతున్నారు. గతంలో నీటి గుండాల్లో పెద్దపెద్ద బండరాళ్లను వేసి పూడ్చి వేసే ప్రయత్నాలు జరిగినా.. గిరిజన సంప్రదాయానికి విరుద్ధమని కొందరు ఆదివాసీ గిరిజనులు అడ్డుకోవడంతో అర్ధాంతరంగానే నిలిచిపోయింది. ఇక్కడే రాతి గృహలో కొలువుదీరిన సోమేశ్వరస్వామి శివరాత్రి పర్వదినాన ఈ నీటి గుండాల్లోనే స్నానం ఆచరిస్తాడని గిరిజనులు నమ్ముతుంటారు. ఈ కారణంగానే నీటి గుండాలను పూడ్చి వేయవద్దంటూ అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పొచ్చెర జలపాతం వద్ద నామమాత్రంగానే భద్రత చర్యలు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా ఇక్కడ కూడా ఎంతో మంది నీటిగుండంలో జారి పడి ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇకనైనా ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి అటవీ శాఖ భద్రత కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.

వసూళ్లకే పరిమితం

కుంటాల జలపాతం అభివృద్ధి పేరిట అటవీ శాఖ ప్రత్యేక చెక్‌పోస్టును ఏర్పాటు చేసింది. దీంతో వచ్చిపోయే పర్యాటకుల నుంచి కొంత ఫీజును వసూలు చేస్తున్నా.. జలపాతం అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. అటవీ శాఖ వసూళ్లకే పరిమితమైందన్న విమర్శలు వస్తున్నాయి. ఆధునికీకరించి అభివృద్ధి చేస్తే పర్యాటకుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉంటుంది. కానీ పాలకులు, అధికారుల్లో అడుగడుగునా అదే నిర్లక్ష్యం కనిపిస్తోంది. ప్రత్యేక రాష్ట్రంలోనూ జిల్లా పర్యటక రంగం అభివృద్ధికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాను తెలంగాణ కాశ్మీర్‌గా తీర్చిదిద్దుతామని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పలుమార్లు హామీలు ఇచ్చిన ఆచరణ సాధ్యం కాలేదు. గతంలో అటవీ శాఖ మంత్రిగా పని చేసిన జోగు రామన్న కూడా పలు రకాల ప్రయత్నాలు చేసినా.. ప్రయోజనమే లేకుండా పోయింది. ప్రమాదకరంగా మారిన జలపాతం వద్ద ఆధునికీకరణ పనులతో పాటు భద్రతా చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికీ ఎన్నిసార్లు విన్నవించినా పర్యాటకుల భద్రతపై అధికారులకు పట్టింపే లేకుండా పోయింది. గతంలో రాష్ట్రస్థాయి అధికారులు కూడా కుంటాల జలపాతాన్ని సందర్శించి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. అయినా అభివృద్ధి పనుల్లో కదలిక కనిపించడం లేదు. అటవీ, పర్యాటక శాఖ, ఐటీడీఏ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో అడుగుముందుకు పడడం లేదు. గతంలో ఐటీడీఏ అధికారులు పనులు చేపట్టేందుకు సిద్ధమైనా.. ఆచరణ సాధ్యం కాలేదు. ఐటీడీఏకు కొన్ని నిధులు మంజూరైన అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది.



భద్రత లేకనే ప్రాణాలు పోతున్నాయి.
: పెంట భోజన్న, నేరడిగొండ మండలం



కుంటాల, పొచ్చెర జలపాతాల వద్ద భద్రతా చర్యలు చేపట్టక పోవడంతోనే ప్రాణాలు పోతున్నాయి. ముఖ్యంగా యువకుల మరణాలే ఎక్కువగా ఉంటున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న పర్యాటకులకు ఇక్కడి పరిస్థితులపై ముందే అవగాహన కల్పిస్తే బాగుంటుంది. కనీసం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తే జాగ్రత్తగా ఉంటారు. అధికారులు ఆ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలి.

అభివృద్ధి విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..
: అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, బోథ్



కుంటాల, పొచ్చెర జలపాతాల అభివృద్ధి పనుల విషయమై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. పర్యాటకులు జాగ్రత్తగా ఉంటూ జలపాతం వద్ద పర్యటించాలి. వర్షాకాల సీజన్ ప్రారంభమయ్యింది. అధికారులు అప్రమత్తంగా ఉండాలి. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాల నివారణకు అడ్డుకట్ట వేయవచ్చు. త్వరలోనే సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలను చేపడుతాం.

సంక్షిప్త సమాచారం



లోక్‌సభలో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న నగేష్

ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీ

బోథ్, జూన్ 25: జిల్లా ఎంపీగా గోడం నగేష్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. 18వ పార్లమెంట్ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత నగేష్ రెండోసారి ఎంపీగా గెలుపొందారు.

28న వారసంత వేలం

నేరడిగొండ, జూన్ 25: మండల కేంద్రంలో ప్రతీ శనివారం నిర్వహించే వారసంత వేలంను ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.10వేల దారవత్తు చెల్లించాలని, వేలంలో నెగ్గినప్పుడు 24గంటల లోపు నాల్గో వంతు డబ్బులు చెల్లించాలన్నారు. ఉదయం 10గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం ఉంటుందని పేర్కొన్నారు.

29న తైబజార్ వేలం

బోథ్, జూన్ 25: మండలకేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వారసంతగాను ఈనెల 29న తైబజార్ వేళలను నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ ఈవో పి.అంజయ్య తెలిపారు. వేలం పాట ఉదయం 11గంటలకు ఉంటుందని, పాల్గొనదలచిన వారు రూ.40 వేలు డిపాజిట్‌గా చెల్లించాలని తెలిపారు. వేలం పాడే వారు గ్రామ పంచాయతీకి ఎలాంటి అప్పులు ఉండరాదని, పూర్తి వివరాలకు గ్రామ పంచాయతీ ఈవోను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఐటీడీఏ పరిధిలో

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

● లైన్ డిపార్ట్‌మెంట్ అధికారుల సమావేశంలో కలెక్టర్ రాజార్షిషా

ఉట్నూర్, జూన్ 25: ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజార్షిసా అన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజార్షిసా ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తాతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం, కేస్లాపూర్ నాగోబా దేవాలయాల నిర్మాణం పనులు త్వరగా ప్రారంభించాలని, వీటిని మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అంతేకాకుండాద ఈ రెండింటి నిర్మాణ పనులకు రూ.రెండు కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా స్థూపం వద్ద కంపౌండ్‌వాల్, బోర్‌వెల్, పంప్‌సెట్, స్ట్రీట్ లైట్స్, షెడ్స్, స్థూపం చుట్టు స్టెప్స్, తదితర నిర్మాణ పనులు అలాగే నాగోబా దేవాలయ నిర్మాణ పనుల్లో కమ్యూనిటీ హాల్, టాయిలెట్స్, బోర్‌వెల్, పంప్‌సెట్స్, స్టెప్స్ విద్యుత్ దీపాలు, తదితర పనులు సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీటికి సంబంధించి అగ్రిమెంట్ జరిగి 15 రోజులు గడుస్తున్నా.. ఇంకా పనులు ఎందుకు ప్రారంభించ లేదన్నారు. ఎక్కువ మంది కూలీలతో పనులు త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా, పక్కన పీవో ఖుష్బుగుప్త

ఉట్నూర్ మండల పరిధిలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న నిర్మాణ పనులు, అడిషనల్ క్లాస్‌రూమ్‌లు, ఏకరూప దుస్తులు, ఐటీడీఏ ద్వారా మేజర్ వర్క్స్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

'కాంగ్రెస్ అంటేనే రైతు పక్షపాతి ప్రభుత్వం'

ఇంద్రవెల్లి, జూన్ 25: కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు పక్షపాతి ప్రభుత్వం అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు రోజుల క్రితం మంత్రి వర్గ సమావేశం ఏర్పాటు చేసి ఏకగ్రీవంగా రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తామని తీర్మానం చేశారు. దీనికి హర్షం వ్యక్తంచేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పెద్దసంఖ్యలో రైతులు, కాంగ్రెస్ నేతలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ముఖడే ఉత్తం మాట్లాడుతూ గత ఎన్నికకల్లో రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తూ వారికి ఇబ్బందులు తలెత్తితే ఆదుకునే ప్రభుత్వమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోన్ కాంబ్లే, జితేందర్, సోమోరే నాఠరావు, గాయక్‌వాడ్ దిలిప్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ ముందు ధర్నా చేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

'గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి'

ఉట్నూర్, జూన్ 25: గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతు టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులు ఐటీడీఏ ముందు ధర్నా నిర్వహించారు. మంగళవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రంభుజంగరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ తర్వాత ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ రెండవ పెద్ద సెక్టర్‌గా ఉన్నదని, గత పాలకులు గిరిజన సంక్షేమ శాఖ పట్ల సవతి ప్రేమను ప్రదర్శించారని ఆరోపించారు. గిరిజన సంక్షేమ శాఖలో సవరించిన సర్వీస్ రూల్స్ వెంటనే ప్రకటించాలని, బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను పాఠశాల సహాయకులుగా ఉన్నతీకరించాలని, ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలన్నారు. జీవో-317 అప్పీళ్లను పరిష్కరించి, గతంలో ప్రాతినిధ్యం చేసిన సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖపై ప్రత్యేక దృష్టిని సారించాలని ఐటీడీఏ ఏపీవో జనరల్ భీమరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, రమేశ్వర్, జ్ఞానేశ్వర్, కుంరంభీమ్ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి అర్జున్,కనక వెంకటేశ్వర్‌రావు, టీపీటీఎఫ్ నాయకులు బలిరాం, వెడ్మ శ్యామ్‌రావు, నారాయణ, సీహెచ్ శ్యామ్‌రావ్, జితేందర్, విశ్వనాథ్, ప్రకాష్, ధర్మంసింగ్, మంగళసింగ్, కైలాస్ రాజేశ్వర్, యోగేశ్వర్‌లు పాల్గొనగా డీటీఎఫ్, రాష్ట్ర కార్యదర్శి ముడుగు శ్యామ్యూల్ గిరిజన సంక్షేమ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మీరా భూమేష్, తదితరులు ధర్నాకు మద్దతు తెలిపారు.

నెంబర్ ప్లేటు లేకుండా వాహనాలు నడిపితే చీటింగ్ కేసు

● ట్రాఫిక్ సీఐ ప్రణయ్‌కుమార్

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 25: నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చీటింగ్ కేసు నమోదు చేస్తామని ఆదిలాబాద్ ట్రాఫిక్ సీఐ ప్రణయ్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని కలెక్టర్ చౌరస్తాలో నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పలు ద్విచక్ర వాహనాలను పట్టుకున్నారు. అంతేకాకుండా నెంబర్ ప్లేట్ బిగించిన తర్వాత పాత చలాన్లు ఉంటే వాటిని కట్టించి వాహనాదారులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ప్రణయ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు తిరుగుతున్నాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలో కూడా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి హెచ్చరించడం జరిగిందన్నారు. అయిన మార్పు రాని కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు రోడ్లపైకి వస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని కోరారు. ఇందులో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, తదితరులున్నారు.



ఆదిలాబాద్‌లో వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ



స్పెషల్ డ్రైవ్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న నెంబర్ ప్లేట్ లేని వాహనాలు

కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం

● ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ● ఒకరి మృతి.. 28మందికి గాయాలు
● బస్సులో ప్రయాణిస్తున్న వారంతా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులు

కామారెడ్డి టౌన్, జూన్ 25: కామారెడ్డి జిల్లాలోని క్యాసంపల్లి గ్రామపరిధిలో గల జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అతి వేగంతో ఢీకొట్టడంతో.. ఒకరు మృతి చెందగా, 28మందికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ నుంచి డైమండ్ ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో 34మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు పయనమయ్యారు. అదే దారిలో మహరాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు గోధుమల లోడ్‌తో గల లారీ వెళుతోంది. మార్గమధ్యలో కామారెడ్డి జిల్లాలోని క్యాసంపల్లి గ్రామ శివారు వద్ద మంగళవారం తెల్లవారుజామున 4గంటలకు లారీలో డీజిల్ అయిపోవడంతో డ్రైవర్ వాహనాన్ని రోడ్డుపై నిలిపాడు. ఆగి ఉన్న లారీకి డ్రైవర్ ఎలాంటి ఇండికేటర్స్ వేయలేదు. అదే సమయంలో అతి వేగంతో వెళుతున్న బస్సు వెనుక వైపు నుంచి లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న అప్సర్‌ఖాన్(26) అక్కడికక్కడే మృతిచెందగా.. మరో 28 మంది గాయాల పాలయ్యారు. ఇందులో బస్సు డ్రైవర్ షేక్ రఫీక్‌కు కుడి కాలి విరగగా, ముబీన్ అనే వ్యక్తికి తలకు తీవ్రగాయమైంది. ప్రస్తుతం వీరి పరిస్థితి విషమంగా ఉంది. లారీని బస్సు బలంగా ఢీకొట్టడంతో అందులోని గోధుమ సంచులు 10 అడుగుల దూరం వరకు చెల్లా చెదురుగా పడిపోవడం,


● రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులు (ఇన్‌సెట్‌లో నుజ్జునుజ్జు అయిన బస్సు ముందు భాగం

బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బతినడంతో భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. స్థానికులు దేవునిపల్లి పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే ఘటనా స్థలికి వెళ్లి క్షతగాత్రులను కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో పాటు బస్సును అక్కడి నుంచి మరో ప్రాంతానికి మార్చి ట్రాఫిక్ సమస్య లేకుండా చూశారు. బస్సులో ప్రయాణిస్తున్న వారంతా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారే.. ఈ ప్రమాదంపై మృతుడు అప్సర్‌ఖాన్ సోదరుడు అప్జల్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

రెండో రోజుకు చేరిన జూడాల సమ్మె

ఆదిలాబాద్ రూరల్, జూన్ 25: రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రిమ్స్ జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. స్టైఫండ్ రెగ్యులర్‌గా ఇవ్వాలని కోరతూ ఆదిలాబాద్ పట్టణంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదుట జూడాలు తమ నిరసనను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షులు సందీప్ చారి మాట్లాడుతూ డాక్టర్ల పని ప్రదేశాలు భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో జూడాలు పాల్గొన్నారు.

కొబ్బరి సాగుపై రైతులకు అవగాహన

ఉట్నూర్, జూన్ 25: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొబ్బరిసాగుపై ఐటీడీఏ అధికారులు నిర్వహించిన అవగాహన సదసునకు భారీ స్పందన లభించింది. ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త ఆదేశాల మేరకు ప్రాజెక్టు హార్టికల్చర్ ఆఫీసర్ సందీప్ ఆధ్వర్యంలో మొదటిసారిగా ఉట్నూర్‌లో కొబ్బరి అభివృద్ధి సంస్థ అధికారులు, వ్యవసాయ ఉద్యా నవన శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు సమన్వయం చేసుకొని ఉమ్మడి జిల్లాలోని పెంచికల్ పేటలో నిర్వహించిన అవగాహన సదస్సుకు 210 మంది గిరిజన రైతులు హాజరయ్యారని మొక్కలు నాటే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించిన శాస్త్రవేత్తలు హా రా రైతులకు ఒక్కొక్కరికి ఐదు మొక్కలు ఉచితంగా పంపిణీ చేశారని ప్రాజెక్టు హార్టికల్చర్ ఆఫీసర్ సందీప్‌కుమార్ తెలపారు. ఈ సందర్భంగా కొబ్బరి అభివృద్ధి సంస్థ విజయవాడ డీబీరీ డైరెక్టర్ కుమార్వెల్, ఉద్యాన శాస్త్రవేత్తలు డాక్టర్ మురళీ, డాక్టర్ యు.స్రవంతి, వ్యవసాయ సహాయ సంచాలకులు రాజుల నాయుడు, ఉద్యానవనాధికారులు శాంతిప్రియ, సుధీర్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగులో ఉన్న ప్రాంతాలలో కొబ్బరిసాగు సునాయసంగా చేయవచ్చని అన్నారు. సాగు విధానం అంతర్‌కృషి, అంతర పంటలు, నీటి ఎరువుల యాజమాన్యం, చీడపీడల నివారణ గురించి అవగాహన కల్పించారు. ఈ ప్రాంత నేలలు వాతావరణ కొబ్బరి సాగుకు అనుకూలంగా ఉన్నాయని అన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఉట్నూర్, జూన్ 25: ఉట్నూర్ మండలం ఘన్పూర్ పంచాయతీ చింతగూడలో గిరిజనుడు పంద్రం రాంచందర్ అనారోగ్యంతో బాధపడుతు మంగళవారం మృతి చెందడంతో విషయం తెలుసుకున్న వెంటనే కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ గ్రామ సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాదిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలిపి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంతకుముందు పంద్రం రాంచందర్ చిత్రపటానికి పూలమాల వేసి పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు.

'పీఎం విశ్వకర్మక యోజనతో రాజుయాదవ్‌కు సంబంధం లేదు'

నేరడిగొండ, జూన్ 25: పీఎం విశ్వకర్మ యోజనతో బోథ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు గొర్ల రాజుయాదవ్‌కు ఎటువంటి సంబంధం లేదని పీఎం విశ్వకర్మ కౌశల్ యోజన కన్వీనర్ చొక్కపల్లి రాములు అన్నారు., మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పార్టీలో సస్పెండ్ అయిన గొర్ల రాజు యాదవ్ పార్టీ ఇచ్చిన పదవిని వాడుకోవడం సిగ్గు చేటన్నారు. నైతిక విలువలకు కట్టుబడి వెంటనే ఆ పదవి నుంచి దిగిపోవాలని డిమాండ్ చేశారు. ప్రజలెవరు కూడా అతడిని నమ్మి మోసపోవద్దన్నారు. ఎంపీ నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ఈ విషయంపై దృష్టి సారించి అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నేరడిగొండ మండలబీజేపీ అధ్యక్షుచి సాబ్లె సంతోష్‌సింగ్, ప్రధాన కార్యదర్శులు బంటు ప్రవీణ్, ధర్మపురి రాఘవులు, ఆకుల రాజశేఖర్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

'రైతు భరోసా'పై అభిప్రాయ సేకరణ

జైనథ్, జూన్ 25: ఆదిలాబాద్ డివిజన్ పరిధిలోని జైనథ్, బేల, ఆదిలాబాద్, మావల మండలాల రైతులకు మంగళవారం మండల కేంద్రమైన జైనథ్ రైతు వేదికలో దృశ్య శ్రావణం ద్వారా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావ్ ద్వారా ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న రైతు బరోసా పథకంపై ముఖాముఖి చర్చ కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య, జైనథ్ ఏఈఓ వివేక్, బేల, బోథ్ ఏఓలు విశ్వమిత్ర, ఆదిలాబాద్ ఏఓ సంధ్య, అష్రఫ్‌లతో పాటు ఆయా గ్రామాల రైతులు ఏఈఓ ప్రజా ప్రతినిధులతో రైతు నేస్తం ద్వారా సలహాలు సూచనలు తెలుసుకున్నారు.

● 'సాగు భూములకే రైతు భరోసాను వర్తింప చేయాలి'

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని రైతులు సాగు చేస్తున్న భూములకు మాత్రమే వర్తింప చేయాలన్నారు. ఇందుకు 15 ఎకరాల వరకు రూ.15 వేలను ఎకరంకు వానకాలం రబీ పంటలకు సకాలంలో అందించాలన్నారు. కొండలు, గుట్టలు, రియల్‌స్టేట్, వాగులు, వంకలకు ఇవ్వవరాదన్నారు.

'రైతుల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం'

తలమడుగు, జూన్ 25: దేశ చరిత్రలోనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని జడ్పీటీసీ గోకా గణేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సుంకిడి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడానికి మంత్రి వర్గం ఆమోదించిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేయడం జరిగిందన్నారు. గత ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తున్నామన్నారు. అంతేకాకుండా రైతుల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ప్రతిపక్షల మాటలు నమ్మి ఎవరూ మోసపోవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తలమడుగు జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ బాబాన్న, మాజీ సింగిల్ విండో చైర్మన్ ప్రకాష్‌రావు, గోక భూమారెడ్డి, ఎంపీటీసీలు రమేష్‌రెడ్డి, కమలాకర్, వెంకన్న యాదవ్, కో ఆప్షన్ మెంబర్ బాబుఖాన్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి పీసీసీ అధ్యక్షుని హోదాలో రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని నెరవేర్చేందుకు చర్యలు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో మంగళవారం బోథ్ బస్టాండ్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.రాజు యాదవ్‌లు మాట్లాడుతూ రైతులను రుణ విముక్తులను చేయాలన్న ఉద్దేశంతో రుణమాఫీ కోసం చర్యలు జూలై ఒకటి నుంచి ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ ఉమేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు భోజన్న, గడ్డల నారాయణతో పాటు పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి : బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గుడిహత్నూర్, జూన్ 25: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని మన్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న బోధన, వసతులపై ఆరా తీశారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకన్నారు. పాఠశాల పరిసరాలు వంటశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వర్షాకాలం కాబట్టి వంట చేసే స్థలంలో అపరిశుభ్రత లేకుండా చూడాలని హెచ్ఎంకు సూచించారు. ఇందులో ఎంపీపీ కేంద్రే జ్ఞానోబా, నాయకులు, తదితరులు ఉన్నారు.

● అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

గుడిహత్నూర్: గుడిహత్నూర్ మాజీ సర్పంచ్ జాదవ్ సునీత మాతృమూర్తి సోమవారం మరణించింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం కొల్హారిలో జరిగిన అంత్యక్రియలకు హాజరయ్యారు. మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

'రైతులకు ఎరువుల కొరత లేకుండా ఏడు కేంద్రాల్లో ఏర్పాట్లు'

తలమడుగు, జూన్ 25: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఎరువుల కొరత లేకుండా మండలంలో ఏడు కేంద్రాల్లో ఎరువులను అందుబాటులో ఉంచడం జరిగిందని తలమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ముడుపు దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్థికంగా నష్టపోకుండా మండలంలో ఏడు కేంద్రాల్లో ఎరువులను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. గత సంవత్సరం నాలుగు కోట్ల రూపాయలతో ఎరువులు విక్రయించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం రూ.6కోట్ల ఎరువులను విక్రయించేందుకు ఏర్పాటు చేశామన్నారు. అలాగే మండలంలో నాలుగు గోదాములు నిర్మించేందుకు ఏర్పాటు చేపడుతున్నామన్నారు. బరంపూర్‌లో సహకార సంఘం ద్వారా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసి రెండు నెలల్లో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇందులో ఉపాధ్యక్షులు పద్మాకర్‌రెడ్డి, సీఈవో మోతి శ్రీనివాస్, డైరెక్టర్లు సెక్రటరీలు సాగర్, గంగయ్య, భీమావు, సిబ్బంది సత్యనారాయణ, రమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ముడుపు దామోదర్‌రెడ్డి

వరదనీటికి దారిలేక.. ముందుకు సాగలేక!!

● చిన్నవర్షానికే చెరవును తలపిస్తున్న ఇచ్చోడ ప్రధాన రహదారి ● దుకాణ సముదాయాల ముందు మట్టితో నిండిన కల్వర్టులు ● వరదనీటిలో రోడ్డుపై కనబడని గుంతలు ● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు

ఇచ్చోడ, జూన్, 25: ఓవైపు ప్రధాన రహదారి విస్తరణ పనులు.. మరోవైపు రోజూ కురుస్తున్న వర్షంతో రోడ్డుపై నీరు నిలిచి స్థానిక ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ఆ మార్గం గుండా వెళ్లే వాహనదారులు రోడ్డెక్కాలంటేనే జంకుతున్నారు. ఏ క్షణం వర్షం కురిసి.. ఏ రోడ్డు జలమయమవుతుందోనని వాపోతున్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట, సిరిచెల్మ చౌరస్తా ప్రాంతంలో రహదారిపై నీరు నిల్వ ఉండడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వర్షాకాలానికి ముందే నాలాల్లో పేరుకుపోయిన మట్టి చెత్తచెదారాన్ని తొలగించాల్సి ఉన్న తొలగించకపోవడంతో వర్షం కురిసినప్పుడల్లా వరదనీరు ప్రధాన రహదారిపై నిలుస్తుంది. గతంలో రోడ్డుపైకి వచ్చిన నీరు అరగంట వ్యవధిలో రోడ్డుపక్కనున్న ఉన్న కల్వర్టుల ద్వారా బయటకు వెళ్లిపోయేది. ప్రధాన రహదారిపై వాహనాలు సజావుగా సాగేవి. అయితే ప్రస్తుతం పనుల కారణంగా వరద నీరు వెళ్లేందుకు దారిలేక చిన్న వర్షానికే భారీగా నీరు నిలిచి తటాకాన్ని తలపిస్తోంది. దీంతో పాదచారులు సైతం అడుగేయాలంటే జంకాల్సిన పరిస్థితి నెలకొంది.



ప్రధాన రహదారిపై పారుతున్న మురుగునీరు



పోలీస్‌స్టేషన్ ఎదుట నిలిచిన మురుగునీరు

● కల్వర్టులు మూసుకుపోయి..

ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణ సముదాయాల భవనాలు ఉండడం వాటి ముందు ఎప్పుడో ఏళ్ల క్రితం చిన్నపాటి పైపులు వేసి కల్వర్టుల నిర్మించుకున్నారు. ప్రతియేటా వర్షాకాలంలో మట్టి, చెత్త నిండి వరదనీరు ముందుకు కదలకపోవడంతో రోడ్డు పైనుంచే వరద నీరు పారేది. ప్రస్తుతం విస్తరణ పనులు సాగుతుండడంతో ఓవైపు రోడ్డు ఎత్తుగా ఉండడంతో వరదనీరు కిందివైపు ఉన్న రోడ్డుపై నిలిచి ఉంటుంది. నీరు పారేందుకు దారిలేక అక్కడే నిలిచి.. వాహనదారులు ముందుకు వేళ్లలేని పరిస్థితి నెలకొంది. వర్షాకాలం అంతా ఈ పాట్లు తప్పవా..? అని పలువురు వాహనదారులు, పాదచారులు వాపోతున్నారు. రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తయితే సమస్యలు తీరతాయేమోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.



ఇచ్చోడలో ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఏర్పడ్డ భారీ గుంతలో స్థానికులు ఏర్పాటు చేసిన చెట్టుకొమ్మ ఇలా..

లబ్ధిదారులు దళారులను నమ్మవద్దు

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 25: ప్రభుత్వ పథకాల కోసం లబ్ధిదారులు మధ్య దళారులను నమ్మవద్దని ఎమ్మెల్యే పాయలశంకర్ సూచించారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ రూరల్, మావల మండలాలకు సంబంధించిన 302 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల కోసం తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు పడొద్దని ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ప్రభుత్వాలు ఏవైనా ప్రజాప్రతినిధులు ఎవరైనా ప్రజా సంక్షేమమే వారి అంతిమ లక్ష్యమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించడం సంతోషకరమన్నారు. ఎన్నికల సందర్భంగా పథకంలో తులం బంగారం కూడా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. దానిపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్‌రంజాని, సుభాష్‌నగర్ కౌన్సిలర్ లక్ష్మణ్, ఆదిలాబాద్ అర్బన్, రూరల్, మావల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ ఎన్నికల హామీలను నెరవేర్చాలి

జైనథ్: తెలంగాణలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 45మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.లక్షా 116 చొప్పున అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల కోడ్ ఉన్నందున లబ్ధిదారులకు అధికారులు తగు చర్యలు తీసుకొని వీటిని ఎప్పటికప్పుడే లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ ఎంపీపీ ఎం.గోవర్ధన్, జడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, జైనథ్ మండల తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో రవీంద్రనాథ్, ఆర్ఐలు నితిన్‌కుమార్, విజయ్‌కుమార్‌లతో పాటు ఆయా గ్రామాల లబ్ధిదారులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆయకట్టుదారులు

'గోపాల్ చెరువుకు నీరటిని నియమించాలి'

ఉట్నూర్, జూన్ 25: ఉట్నూర్ పట్టణంలోని గోపయ్య చెరువుకు నీరటిని నియమించాలని గోపాయి చెరువు ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఈ మేరకు మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని డిప్యూటీ తహసీల్దార్ వెద్మభుజంగరావుకు వినతి పత్రం అందజేశారు. చెరువకు నీరటి లేక పోవడం వల్ల చెరువు నీరు వృథా అవుతుందని, చెరువు నీటిని కాపాడి రైతులకు ప్రయోజనం కలిగించేలా నీరటిని నియమించాలని కోరారు. ఉన్నత అధికారులకు విషయం తెలిపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని భుజంగరావు రైతులకు హామీ ఇచ్చారు. ఇందులో గిరిజన నాయకులు దుర్వమహేశ్, రైతులు బింగ వెంకటేశ్, బానోత్ రవీందర్, కొండేరి శివాజీజీ, తదితరులున్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాద్

ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను ఆదర్శంగా తీసుకోవాలి

నిర్మల్ కల్చరల్, జూన్ 25 : నర్సింగ్ ఆఫీసర్లు ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకొని సేవలందించాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జేవీడీఎస్ ప్రసాద్ అన్నారు. మంగళవారం బోధనా ఆసుపత్రిలో నూతనంగా నియమితులైన నిర్సంగ్ ఆఫీసర్లకు బ్యాడ్జ్, క్యాపింగ్ ధరింపజేశారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ... వైద్యరంగంలో సేవలు అందించే అవకాశం గొప్పదని అన్నారు. ఈ అవకాశం ఉపయోగించుకొని రోగులకు సేవలందిస్తూ వృత్తి ధర్మాన్ని, కుటుంబ బాధ్యతను నిర్వర్తించాలన్నారు. సూపరెండెంట్ సునీల్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకురాలు దరహాస, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

బేటీ బచావో.. బేటీ పడావోపై అవగాహన



కుభీర్‌లో బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కుభీర్, జూన్ 25 : మండల కేంద్రం కుభీర్‌లోని మహిళా సమైఖ్య కార్యాలయంలో మంగళవారం మహిళాసాదికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండర్ స్పెషలిస్ట్ మౌనిక మాట్లాడుతూ పీసీపీఎన్‌డీటీ యాక్ట్ గురించి వివరించారు. ఈ చట్టం భ్రూణహత్యలను ఆపడానికి అలాగే క్షీణిస్తున్న లింగ నిష్పత్తిని అరికట్టడానికి ఉపయోగపడుతుందన్నారు. అలాగే బాల్య వివాహ నిర్మూలన, పోక్సోయాక్ట్ గురించి వివరించారు. మిషన్ శక్తి ఆర్థిక అక్షరాస్యత నిపుణులు శైలజ మాట్లాడుతూ ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజన స్కీమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం, సీసీ, సీఏ, వీవోఏలు పాల్గొన్నారు.

'14 వస్తువులకే మద్దతు ధర ప్రకటించడం శోచనీయం'



మాట్లాడుతున్న వక్త పద్మ

నిర్మల్ కల్చరల్, జూన్ 25 : కేంద్రప్రభుత్వం నామమాత్రంగా 14 వస్తువులకు మద్దతు ధర ప్రకటించడం శోచనీయమని రైతు నాయకురాలు పద్మ అన్నారు. మంగళవారం జరిగిన రైతు సమావేశంలో ఆమె మాట్లాడుతూ... కేంద్రప్రభుత్వ రైతు వ్యతిరేక విధానానికి నిదర్శమన్నారు. అన్ని రకాల వస్తువులకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని, రుణమాఫీకి కట్ ఆఫ్ డేట్ పెట్టవద్దని, 2 లక్షల రుణమాఫీ ఒకేసారి చేయాలన్నారు. కౌలు రైతుకు భరోసా ఇవ్వాలని కోరారు. విలాస్, దేవిదాస్, భూమయ్య, రాజేశ్వర్, మల్కన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లను కేటాయించాలంటూ

డబుల్ బెడ్రూమ్ లబ్ధిదారుల ఆందోళన



అర్‌డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

భైంసా, జూన్ 25 : ఏడాది క్రితం లక్కీ డ్రా ద్వారా ఎంపికైన తమకు డబుల్ బెడ్రూమ్‌లను అందించాలని డిమాండ్ చేస్తూ భైంసా పట్టణ లబ్ధిదారులు పక్షం రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు ఇక్కడి అర్‌డీవో కార్యాలయానికి చేరుకొని ఆందోళనలకు దిగారు. లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులుగా ఎంపికైన పత్రాలను చూపిస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అర్‌డీవో కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేపట్టారు.ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు డబుల్ బెడ్రూమ్ లబ్ధిదారులు మాట్లాడుతూ సంవత్సర కాలం నుంచి ఇళ్ల కేటాయించకుండా జాప్యపు విధానాలను అవలంభించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు.

అధికారులు ఇకనైనా కాలయాపన వ్యవహారాన్ని కట్టిపెట్టి తమకు ఇండ్లు అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులు ర్యాలీగా మాజీ ఎమ్మెల్యే, ముథోల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ బోస్లే నారాయణరావ్ పాటిల్‌ను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరింపచేసేందుకు చర్యలు తీసుకుంటానని మాజీ ఎమ్మెల్యే పాటిల్ లబ్ధిదారులకు తెలిపారు.

అన్ని వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వధ్యేయం

● కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ ఎం.ఏ లతీఫ్

భైంసా, జూన్ 25 : ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా అన్ని వర్గాల అభ్యున్నతియే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ పార్టీ పాటుపడుతోందని ఆ పార్టీ మైనారిటీ సెల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ ఎంఏ. లతీఫ్ పేర్కొన్నారు. మంగళవారం భైంసాలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల అమలు ప్రక్రియకు చర్యలు వేగవంతమయ్యాయని వెల్లడించారు. రైతన్నలకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ కోసం రంగం సిద్ధమయ్యిందన్నారు. అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజానీకానికి సంక్షేమ ఫలాలు అందించే దిశగా సర్కార్ చర్యలు చేపడుతోందన్నారు. పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ప్రగతిని, చేపడుతున్న సంస్కరణలు, సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల కోసం సన్నద్ధమవ్వాలని సూచించారు. గత సంవత్సరం జూన్ మాసంలో ముథోల్ నియోజకవర్గ పరిధిలో నిస్తేజస్థితిలోనున్న పార్టీకి జవసత్వాలు పోసి పటిష్టపరచేందుకు తాను చేపట్టిన మహాపాదయాత్ర సత్ఫలితాలనిచ్చిందన్నారు. అవసరమైన పక్షంలో మరోమారు ముథోల్ నియోజకవర్గ వ్యాప్తంగా మహాపాదయాత్ర చేపట్టి ఇక్కడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరింపచేసేందుకు బాధ్యతాయుతంగా కృషి చేస్తానన్నారు. పాదయాత్ర చేపట్టి సంవత్సరకాలం పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక ఏరియా ఆసుపత్రిలోని రోగులకు కాంగ్రెస్ మైనారిటీ సెల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ ఎం.ఏ. లతీఫ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పండ్ల పంపిణీ చేపట్టారు. ఇందులో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్‌చంద్రే, బెజ్జంకి ముత్యంరెడ్డి, ప్రతినిధులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, గాడేకర్ రమేష్‌లతో పాటు డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాల పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ ఎదుట పార్టీ శ్రేణులు ప్రదర్శనలు నిర్వహించి విశ్రాంతి భవనం వరకు ర్యాలీ నిర్వహించాయి.



ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ ప్రతినిధులు

మావోయిస్టుల కదలికలపై

అప్రమత్తంగా ఉండాలి

● కుమరం భీం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

బెజ్జూరు, జూన్ 25: మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులోని పోలీసులు మావోయిస్టుల కదిలికలపై అప్రమత్తంగా ఉండాలని కుమరం భీం జిల్లా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం బెజ్జూరు మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లాలో మావోల ప్రాబల్యం పూర్తిగా తగ్గి పోయిందని, అయినప్పటికీ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో పోలీసులు ప్రతినిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పక్కనే మహారాష్ట్రలో మావోలకదిలికలు అధికంగా ఉండడంతో ప్రాణహిత నది దాటి వచ్చే అవకాశం ఉన్నందున నిఘా పెట్టాలని సూచించారు. అలాగే పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేసే దిశగా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ కరుణాకర్, సీఐ సాదీక్ పాషా, ఎస్సై విక్రం తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాగజ్‌నగర్, జూన్ 25: కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ గ్రామ శివారు సమీపంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. అంకుసాపూర్ శివారులో గుర్తు తెలియని మృతి చెంది ఉన్నట్టు సమాచారం రావడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించామని చెప్పారు. మృతి చెందిన వ్యక్తి 50 సంవత్సరాలు దాటి ఉంటుందని, శరీరంపై ఎలాంటి గాయాలు లేవన్నారు. ఆచూకి తెలిసిన వారు రూరల్ పోలీసులను సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని సిర్పూరు(టి) ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామని ఎస్సై తెలిపారు.

గుడుంబా

విక్రయిస్తున్న ఒకరిపై కేసు

కాగజ్‌నగర్, జూన్ 25: కాగజ్‌నగర్ మండలం వంజీరి మన్నెవాడుకు చెందిన దుర్గం లక్ష్మణ్ మంగళవారం ఐదు లీటర్ల గుడుంబా అమ్ముతుండగా, పట్టుకొని కేసు నమో దు చేసినట్టు రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. గ్రామా ల్లో గుడుంబా, నాటుసారా విక్రయించొద్దని తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

కాగజ్‌నగర్, జూన్ 25: కాగజ్‌నగర్ కిమ్స్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. 19 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఇందులో 10 మందికి శస్త్ర చికిత్సలు అవసరమున్నట్టు డాక్టర్లు నిర్ధారించారు. త్వరలోనే వీరికి శస్త్ర చికిత్సలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌శ్రీనివాస్, డాక్టర్ అనిత తెలిపారు. వైద్య శిబిరంలో అప్తమాలజిస్ట్ వసి, గోపి పాల్గొన్నారు.

భక్తుల ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 25: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ గణేశ్ మందిర్‌లో మంగళవారం అంగరిక చతుర్థిని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఒజ్జల శిరీష్ శర్మ, సూర్యనారాయణ శర్మ, శ్రీనివాస్‌శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్టం 34.8 : కనిష్టం 26.6



నిర్మల్ జిల్లా వార్తలు
8
బుధవారం 26 జూన్ 2024



పరేషాన్‌లో పంచాయతీలు

- నిధుల కొరతతో తిప్పలు
- 2022 నుంచి ఆగిపోయిన నిధులు
- జనరల్ ఫండ్ నిధులతోనే నెట్టుకొస్తున్న అధికారులు
- అప్పుల పాలవుతున్న జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు

నిర్మల్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామ పంచాయతీల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా గత నాలుగైదు సంవత్సరాల నుంచి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పల్లెప్రగతికి శాపంగా మారింది. కేవలం స్టేట్‌ఫైనాన్స్, సెంట్రల్‌ఫైనాన్స్ నిధులను మాత్రమే పంచాయతీలకు విడుదల అయినప్పటికీ ఆ నిధులతో పూర్తిస్థాయి పనులు చేపట్టలేదు. జిల్లాలోని 396 గ్రామ పంచాయతీల పరిస్థితి ప్రస్తుతం అయోమయంగా మారిందని అంటున్నారు. 2019 సంవత్సరం నుంచి 2022 సంవత్సరం వరకు అరకొరగా నిధులు విడుదలైనప్పటికీ పూర్తిస్థాయిలో ఆ నిధులు విడుదల కాని కారణంగా గ్రామ పంచాయతీల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడిలాగే మారిపోయింది. ప్రతీ ఏటా ఒక్కో గ్రామపంచాయతీకి రూ.5.50 కోట్ల నిధులు మంజూరు కావాల్సి ఉంటుంది. కానీ 2022 సంవత్సరం నుంచి పల్లెలకు విడుదల కావాల్సిన నిధులు నిలిచిపోయాయి. దాదాపు రెండు సంవత్సరాల నుంచి గ్రామ పంచాయతీలన్నీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైపు నిధుల కోసం ఆశగా ఎదురుచూస్తూ అలసిపోతున్నాయి. జిల్లాలో మొత్తం 396 గ్రామపంచాయతీలు ఉండగా అన్ని పంచాయతీల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది. 396 గ్రామ పంచాయతీలకు గానూ 1600 మంది మల్టీ పర్పస్‌వర్కర్లు పనిచేస్తున్నారు. వీరందరికీ వేతనాలతో పాటు కరెంటు బిల్లులు, ట్రాక్టర్ వాయిదాలు, పారిశుధ్య సమస్య పరిష్కారం లాంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఎప్పటికప్పుడు నిధులు మంజూరుకాకపోవడంతో వీరు కూడా సక్రమంగా విధులు నిర్వహించడం లేదని అంటున్నారు. వేతనాలు సక్రమంగా విడుదల కాని కారణంగా మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్లు జీతాల కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంటోందంటున్నారు. కాగా గత సంవత్సరం స్టేట్‌ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి గ్రామ పంచాయతీలకు రూ.16 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. అలాగే 2023-2024 సంవత్సరానికి సంబంధించి స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ కింద రూ.2.98 కోట్లు విడుదలైనప్పటికీ ఈ నిధులు పంచాయతీలకు సరిపోలేదని చెబుతున్నారు. ఎప్పటికప్పుడు నిధులు విడుదల కాని కారణంగా ప్రస్తుతం పంచాయతీ సెక్రెటరీలకు నిర్వహణ భారం తడిసిమోపెడుతోందని అంటున్నారు. చాలా మంది పంచాయతీ కార్యదర్శులు పనుల కోసం అప్పుల పాలవుతున్నారు. ఒక్కో మల్టీ పర్పస్‌గా పనిచేసే వారికి ప్రస్తుతం 396 గ్రామ పంచాయతీలకు గాను రూ.17 కోట్ల నిధులు అవసరమవుతాయని పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం గ్రామ పంచాయతీలను జనరల్ ఫండ్ నిధులతోనే కొనసాగిస్తున్నప్పటికీ ఆ నిధులు ఏ మూలన సరిపోవడం లేదని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్ల నుంచి నిలిచిపోయిన నిధులు

కాగా జిల్లాలోని 396 గ్రామ పంచాయతీలకు గత రెండు సంవత్సరాల నుంచి నిధులన్నీ నిలిచిపోయాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంటోందని చెబుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఎప్పటికప్పుడు నిధులను విడుదల చేయకపోవడంతో చాలా చోట్ల పనులన్నీ ఎక్కడికక్కడ స్తంభించిపోయాయి. ముఖ్యంగా గ్రామాల్లో వీధిలైట్ల నిర్వహణ, పబ్లిక్ కులాయిలు, గ్రామపంచాయతీ భవన నిర్మాణాలు, మరుగుదొడ్ల నిర్మాణాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు లాంటి పనులను చేపట్టలేకపోతున్నారు. అయితే కంటి తుడుపు చర్యగా జనరల్‌ఫండ్ నిధులతోనే నెట్టుకొస్తున్నారు. చాలా గ్రామాల్లో ప్రస్తుతం పారిశుధ్య సమస్య తీవ్రమైంది. వర్ష కాలంలో పారిశుధ్య సమస్య కారణంగా వ్యాధులు వ్యాపించే ప్రమాదం పొంచి ఉందని అంటున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీలకు సరిపోయేంతగా నిధులను విడుదల చేయాలని కోరుతున్నారు.

ఫైనాన్స్ నిధులతోనే ముందుకు..

గ్రామ పంచాయతీలు ప్రస్తుతం స్టేట్‌ఫైనాన్స్ సెంట్రల్ ఫైనాన్స్ నిధులతోనే అరకొర అభివృద్ధి పనులను చేపడుతున్నాయి. ఈ నిధుల వినియోగానికి అనేక నిబంధనలు ఉన్న కారణంగా పనులు పూర్తిస్థాయిలో చేపట్టలేని పరిస్థితి నెలకొందంటున్నారు. గ్రామాల్లో ప్రజలు అభివృద్ధి పనుల కోసం డిమాండ్ చేస్తున్నప్పటికీ పంచాయతీ కార్యదర్శులు చేతులెత్తేసే పరిస్థితి నెలకొంటోంది. మొన్నటి వరకు పంచాయతీ కార్యదర్శులతో పాటు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు ప్రజలకు అభివృద్ధి పనుల విషయంలో సమాధానం ఇచ్చేవారు. ఇటీవలే సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ఆ భారమంతా సెక్రెటరీల పైనే పడుతోందని అంటున్నారు. ఓ వైపు ప్రభుత్వం సక్రమంగా నిధులు విడుదల చేయకపోతుండడం, మరోవైపు సమస్యలు పెరిగిపోతున్న కారణంగా పంచాయతీ కార్యదర్శులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. తమ విధుల నిర్వహణ విషయంలో వారంతా ఇక్కట్లను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అంటున్నారు. కొంతమంది పంచాయతీ కార్యదర్శులు తాము విధులను నిర్వహించలేమని బాధ్యతలను తీసుకునేందుకు వెనకాడుతున్నారు.



కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామ పంచాయతీ భవనం

కొత్త సర్కారుపై కోటి ఆశలు..

కాగా గ్రామ పంచాయతీలకు నిధుల విడుదల విషయంలో గాని అభివృద్ధి పనుల విషయంలో గాని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేయని కారణంగా పల్లెల్లో ప్రగతి అంతా పడకేసింది. చాలాసార్లు సర్పంచ్‌లు అధికారిక, రాజకీయ సమావేశాల్లో నిధుల కోసం గళమెత్తి ఆలిసిపోయారు. కొంతమంది అప్పటి అధికార పార్టీ సర్పంచ్‌లు తమ పదవులకు రాజీనామాలు చేసి నిరసనలు తెలిపారు. మరికొంతమంది అప్పుల బాధతలు తాళలేక పదవులకు రాజీనామానాలు చేశారరు. అయినప్పటికీ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిధుల విడుదల విషయంలో కనికరం చూపలేదు. దీని కారణంగా గ్రామాల్లో ఎక్కడికక్కడ అభివృద్ధి స్థంభించిపోయింది. కాగా ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే పల్లెలను ఆదుకుంటామని ప్రకటించి తాత్కాలిక ఊరటనిచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన హామీపైనే ప్రస్తుతం గ్రామ పంచాయతీ ప్రజలంతా ఆశలు పెట్టుకుంటున్నారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెల ప్రగతికి అవసరమైన మేరకు నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎంఐఎం నాయకులు



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంఐఎం నాయకులు

నిర్మల్ కల్చరల్, జూన్ 25 : కలెక్టర్ అభిలాష అభినవ్‌ను నిర్మల్ ఎంఐఎం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షుడు అజీమ్‌బీన్ యాహియా పుష్పగుచ్ఛం అందజేశారు. నాయకులు రఫీక్‌అహ్మద్, మొహమ్మద్ ఉస్మాన్, సయ్యద్ మజహర్, కౌన్సిలర్లు ముజాహిద్, సయ్యద్ అబ్రార్ హుస్సేన్, ఇంతియాజ్, అక్రమ్ జబ్బార్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల పెండింగ్ బిల్లును విడుదల చేయండి

- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌కు జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి వినతి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నిర్మల్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న స్థానిక సంస్థల బిల్లులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేసినట్లు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో చేసిన నిర్లక్ష్యంతో స్థానిక సంస్థలు నిర్వీర్యం అయ్యాయన్నారు. దీంతో పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల పరిధిలో పలు రకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే స్థానిక సంస్థలకు నిధులను మంజూరు చేసి పెండింగ్ బిల్లులను చెల్లించాలని ఆయన రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను కోరినట్లు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ప్రజాస్వామ్య చరిత్రలోనే జూన్ 5 చీకటి రోజు

- బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారు శాంతికుమార్



నిర్మల్ కల్చరల్, జూన్ 25 : భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలోనే జూన్ 25 చీకటి రోజని బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారు శాంతికుమార్ అన్నారు. మంగళవారం ఆర్‌కే కన్వెన్షన్ హాల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వీరులను, ఉద్యమకారులను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 1977 మార్చ్ 21 వరకు అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ ప్రత్యర్థులను జైలుపాలు చేసి పత్రికలపై సెన్సార్ విధించిందన్నారు. వాస్తవాలు చెప్పేందుకు ప్రయత్నించిన పత్రికలపై తీవ్రనిర్బంధం విధించారన్నారు. ప్రశ్నించే మేధావులు, పాత్రికేయుల గొంతునొక్కారని ఎన్నో సంస్థలను రద్దు చేశారని విమర్శించారు. 1975 జూన్ 25 ఒక చీకటి రోజుగా నిలిచిపోయిందని అంతర్గత అస్థిరత, అశాంతి కారణం చూపుతూ జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటించి భారత రాజ్యాంగ హక్కులను తుంగలో తొక్కారని అన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి, మొరార్జీ దేశాయి, చంద్రశేఖర్ లాంటి ఎంతోమంది ప్రముఖులను జైళ్లలో పెట్టారన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, సత్యనారాయణగౌడ్, సామ రాజేశ్వర్‌రెడ్డి, మేడిసెమ్మెరాజు, విలాస్, కమల్‌నయన్, కే.శ్రావణ్‌రెడ్డి, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామం పూర్తికి అన్ని చర్యలు : చైర్మన్ ఈశ్వర్



వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, జూన్ 25 : నిర్మల్ పట్టణ ప్రజలకు అన్ని హంగులతో మోడల్ వైకుంఠధామం అందుబాటులోకి రానుందని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. మంగళవారం ఆయన శివాజీచౌక్‌లో నిర్మాణంలో ఉన్న వైకుంఠధామాన్ని సందర్శించారు. మిగిలి ఉన్న పనులను సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వైకుంఠదామం పూర్తయితే 12 నుంచి 16 వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. దహన సంస్కారాలు నిర్వహించేందుకు వీలుగా శవదహన ప్లాట్‌ఫారంలు, సిట్టింగ్ హాల్స్, స్త్రీ, పురుషులకు స్నానపుగదులు, మంచినీటి ట్యాంకు, వీధిదీపాలు తదితర సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. దహన సంస్కారాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్మాణం చేపట్టామన్నారు. వైకుంఠధామం అధ్యక్షుడు, కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్, స్థానిక కౌన్సిలర్ తులసి నర్సాగౌడ్, పూదరి రాజేశ్వర్, ఎస్పీ రాజు, నాయకులు శంకర్‌పతి, అడప పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

మురికినీరు వెళ్లేందుకు తాత్కాలిక డ్రైనేజీ ఏర్పాటు

- మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం



సుభాష్‌నగర్ కాలనీలో నిలిచిన మురికి నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఖానాపూర్, జూన్ 25 : పట్టణంలోని 12వ వార్డు పరిధిలోని సుభాష్‌నగర్ కాలనీలో మురికినీరు వెళ్లేందుకు తాత్కాలిక డ్రైనేజీ నిర్మించినట్లు మున్సిపల్ చైర్మన్ సత్యం తెలిపారు. మంగళవారం తాత్కాలిక డ్రైనేజీ ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గత కొంతకాలంగా కాలనీలో డ్రైనేజీ నీరు వెళ్లేందుకు మురికి కాలువ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. విషయాన్ని స్థానిక కౌన్సిలర్ తన దృష్టికి తీసుకురావడంతో తాత్కాలిక డ్రైనేజీ ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, వార్డు స్పెషల్ ఆఫీసర్ సంతోష్, మెప్మా సిబ్బంది నారాయణ, సుభాష్‌నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

'తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి'



ఆయిల్ బాల్స్ తయారు చేస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), జూన్ 25 : తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు చేపట్టాలని ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్ గ్రామ పంచాయితీ కార్యదర్శి నవనీత్‌ను ఆదేశించారు. ఆయన మంగళవారం గ్రామ పంచాయితీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో ముందస్తు దోమల నివారణ చర్యలు చేపట్టేందుకు ఆయిల్ బాల్స్ తయారు చేస్తున్న పనులను మంగళవారం యంపీవో శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. గ్రామంలో ఎక్కడ కూడా గ్రామ పంచాయితీలోని రికార్డులను ఆయన పరిశీలించారు. గ్రామంలో ఎక్కడా కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని ఆయన పంచాయితీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామంలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉందని తెలిస్తే వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు జరుపుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆయన కోరారు. అనంతరం ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధానలక్ష్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

పెంబి, జూన్ 25 : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. పెంబి మండలంలోని మందపల్లి గ్రామంలో 18 కోట్లతో పల్కేరు వాగుపై వంతెన, బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తోం దన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగారెడ్డి, మాజీ సర్పంచ్ సుధాకర్, భూక్యా గోవింద్, మాజీ ఏఎంసీ చైర్మన్ పుప్పాల శంకర్, వీడీసీ అధ్యక్షులు భీమన్న, అశోక్ రావ్, గొర్ల లింగన్న, ఎంపీడీవో రమాకాంత్, డీఈఈ మల్లారెడ్డి, అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు.. ప్రయాణికులకు ఇబ్బందులు

లక్ష్మణచాంద, జూన్ 25 : మండలంలోని చామన్‌పెల్లి ఎక్స్‌రోడ్ నుంచి మునిపెల్లి, మల్లాపూర్ మీదుగా ధర్మారం, లక్ష్మణచాందకు వెళ్లే పంచాయతీ రాజ్‌తారు రోడ్డుపై గుంతలు పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ రోడ్డు మునిపెల్లి, మల్లాపూర్, మాచాపూర్ గ్రామాలతో పాటు సోన్ మీదుగా నిజామాబాద్ వెళ్లే వారికి, అనునిత్యం మండల కేంద్రానికి వెళ్లే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉండేది. మల్లాపూర్ నుంచి లక్ష్మణచాంద వెళ్లే తారు రోడ్డు కూడా పూర్తిగా చెడిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు సహితం వయా మల్లాపూర్, చామన్‌పెల్లి మీదుగా మునిపెల్లికి అనునిత్యం రాకపోకలు కొనసాగిస్తాయి. వ్యవసాయ ఉత్పత్తులను నిజామాబాద్, నిర్మల్ తదితర వ్యవసాయ మార్కెట్‌లకు తరలించాలంటే ఈ రోడ్డే ప్రధానమార్గం. ఇంతటి ప్రాధాన్యం గల ఈ రోడ్డు నేడు గుంతలు పడి అధ్వాన్నంగా తయారైంది. పెద్ద వాహనాలే కాదు. ద్విచక్ర వాహనాలపై కూడా ఈ రోడ్డుపై వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. కాస్త వర్షం కురిసినా రోడ్డు పై నీరు నిలిచి కుంటలుగా కనిపించే దృశ్యాలు దర్శనమిస్తాయి. అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి వెళ్లాలంటే క్షేమంగా వెళ్లి తిరిగి వస్తారో రారో అన్న సందేహాత్మకంగా తయారైంది ఈ రోడ్డు దుస్థితి. కాబట్టి ఎంతో ప్రజోపయోగం కలిగిన ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేసి నూతనంగా తారు రోడ్డు వేయాలని పలువురు కోరుతున్నారు.



చామన్‌పెల్లి నుంచి నిజామాబాద్, లక్ష్మణచాందకు వెళ్లే తారు రోడ్డుపై గుంతలు పడిన దృశ్యం

ప్రతిపాదనలు పంపాం : పీఆర్ ఏఈ శ్రీధర్

ధర్మారం నుంచి మల్లాపూర్, మునిపెల్లి మీదుగా చామన్‌పెల్లి ఎక్స్ రోడ్ వరకు రోడ్డు నిర్మాణం కోసం ఇదివరకే ప్రతిపాదనలు పంపాం. అలాగే మండలంలో అవసరమైన లింకు రోడ్లన్నింటికీ కూడ ప్రతిపాదనలు పంపటం జరిగింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే టెండర్ల అనంతరం ఈ రోడ్డు నిర్మాణం చేపట్టే అవకాశం ఉంది.

ఆర్టీసీ వారు సర్వీసులు నిలిపివేస్తామంటున్నారు



రోడ్డు పూర్తిగా పాడైపోయినందున ఆర్టీసీ వారు సర్వీసులు నిలిపివే స్తామంటున్నారు. నిలిపి వేసిన ప్రతిసారీ బ్రతిమాలుకుంటూ బస్సు సర్వీసులను పునరుద్ధరించుకునే దరిద్రపు పరిస్థితి నెలకొంది. బస్సు సర్వీసులు నిలిపి వేస్తే 3 గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. పెద్ద వాహనాలతో పాటు చిన్న వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. కాబట్టి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యేలా చూడాలి.

- కమల్‌కోట వెంకట్‌రెడ్డి, నాయకులు, మునిపెల్లి

ప్రభుత్వ భూములని తేలితే స్వాధీనం చేసుకుంటాం

- సర్వే అనంతరం సమస్యకు పరిష్కారం చూపుతాం..
- భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి



గ్రామస్థులతో మాట్లాడుతున్న భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి

లోకేశ్వరం, జూన్ 25 : సర్వే అనంతరం ప్రభుత్వ భూములని తేలితే స్వాధీనం చేసుకుంటానమని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి హెచ్చరించారు. గ్రామస్థులు గొడవలకు దిగకుండా సంయమనం పాటించాలన్నారు. మంగళవారం ఆయన లోకేశ్వరం మండలంలోని గడ్‌చందా గ్రామ సమీపంలోని ఎస్సారెస్పీలో ముంపునకు గురైన వివాదాస్పద భూములను పరిశీలించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం సమయంలో ముంపుకు గురయ్యే భూములకు నష్టపరిహారం తీసుకున్న కొంతమంది రైతులు మళ్లీ వాటిలో పంటలు సాగు చేయడమే కాకుండా క్రయ, విక్రయాలు జరుపుతున్నారని దీంతో పశువులకు పశుగ్రాసం లభించడం లేదని, ఆ భూముల్లో పంటలు సాగు చేయకుండా నియంత్రించాలని గ్రామస్థులు సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం భైంసా ఆర్డీవో ఆ భూములను పరిశీలించారు. వెంటనే ఆయన ఎస్సారెస్పీ అధికారులతో ఫోన్‌లో సంప్రదించి వీలైనంత త్వరలో సర్వే నిర్వహించి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములు ఉన్నట్లు తేలితే వాటిని స్వాధీనం చేసుకోవాలని స్థానిక అధికారులకు సూచించారు. అంతవరకు గ్రామస్థులు సంయమనం పాటించాలని కోరారు. ఆయనతో పాటు తహసీల్దార్ మోతిరాం, ఎస్సై మోహన్‌రావు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ బాలకిషన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాజ్యాంగబద్ధంగానే ఎమర్జెన్సీ

- కాంగ్రెస్ నాయకుడు మల్లారెడ్డి

నిర్మల్ కల్చరల్, జూన్ 25 : భారతదేశంలో అప్పటి పరిస్థితులను అనుసరించి రాజ్యాంగబద్ధంగానే మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అల్లూరి మల్లారెడ్డి సమర్థించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కాంగ్రెస్ పార్టీని గాని, ఇందిరాగాంధీని విమర్శించే నైతి హక్కు బీజేపీకి లేదన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పదేళ్లుగా అప్రకటిత ఎమర్జెన్సీ పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు.

నేడు పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు

నిర్మల్ కల్చరల్, జూన్ 25 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పన, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీ, విద్యారంగ సమస్యలపై బుధవారం జిల్లాలోని పాఠశాలలు బంద్ పాటించాలని ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ శివకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ... ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అమ్మడం తదితర అంశాలపై ప్రభుత్వం చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. దినేష్, జస్వంత్, గణేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

'పార్టీలో కష్టపడ్డవాళ్లకే పదవులు ఇవ్వాలి'

కుబీర్, జూన్ 25 : పార్టీలో కష్టపడ్డవాళ్లు, నిజమైన కార్యకర్తలనే పార్టీ గుర్తించి పదవులు ఇవ్వాలని ఎస్సీ సెల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెన్నెల సతీష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం కుబీర్‌లో ఆయన మాట్లాడుతూ పార్టీలోనే ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన నిజమైన నాయకులు, కార్యకర్తలను పార్టీ గుర్తించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పటి నుంచి పార్టీలోనే ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేశామని, కొందరు పార్టీ అధికారంలోకి రాగానే పార్టీలోకి చేరారని, నిజమైన కార్యకర్తలను పార్టీ గుర్తించి పదవులు అప్పజెప్పాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.